నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 7 జూన్ 2024 | SIDDIPET

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కూచన్‌పల్లిలో ప్రభుత్వ బడిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ రూరల్, జూన్ 6: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం హవేళీఘనపూర్ మండలంలోని కూచన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని ఎమ్మెల్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన విద్యా బోధన జరగాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బడులు ఆధునికతను సంతరించుకుంటున్నాయని పేర్కొన్నారు. పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పనుల్లో వేగం పెంచి నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. బడి మానేసిన పిల్లందరినీ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, తహసీల్దార్ నారాయణ, ఉపాధ్యాయులు మల్‌రెడ్డి, మధుసూదన్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మిషన్ భగీరథ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట అర్బన్, జూన్ 6: సిద్దిపేట జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ మొబైల్ అప్లికేషన్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2 లక్షల 17 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయని..సర్వే మిషన్ భగీరథ కనెక్షన్లు, ఇతర నల్లా కనెక్షన్లు, నీరు వస్తున్న, రాని కనెక్షన్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈ సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని, మున్సిపాలిటీల్లో ఇంటింటికీ ఎక్కువ కనెక్షన్లు ఉంటే ఇంట్లో సభ్యుల వివరాలను ఎంట్రీ చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్ల, మేజర్ పంచాయతీల్లో ఎంపీడీవో, ఎంపీవో మానిటరింగ్ చేయాలన్నారు. ఈ మొబైల్ అప్లికేషన్ సర్వే కోసం జిల్లాలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాటీ టీచర్లు, ఆశ వర్కర్లు దాదాపు 1200 మందికి రెండు సెషన్లలో శిక్షణ ఇస్తామని చెప్పారు. అంతకు ముందు హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొబైల్ అప్లికేషన్ చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేశ్, డీపీవో దేవకీదేవి, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఈఈ గిరిధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- బయోమెట్రిక్ సిస్టంతో పారదర్శకంగా పరీక్షలు
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

మాట్లాడుతున్న మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గుర్తింపు కోసం బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తీసుకుంటామని, అభ్యర్థులు గంట ముందుగానే (ఉదయం 9 గంటలకు) పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. ఎస్పీ బాలస్వామి ఆదేశానుసారం గురువారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డ్ నియమావళి మేరకు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు, అబ్జర్వర్లకు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు, గ్రూప్-1 ప్రిలిమినరీ రాత పరీక్ష బయోమెట్రిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ..పరీక్షకు సంబంధించిన నిబంధనలు హాల్‌టికెట్లో పొందుపర్చారని, అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు హాల్ టికెట్‌లోని నిబంధనలు చదువుకోవాలన్నారు. పరీక్ష హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులకు అనుమతి లేదని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గోరింటాకు, మెహందీ వంటివి పెట్టుకోరాదని సూచించారు. ఎంపిక విధానం పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని అభ్యర్థులు గుర్తించాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పరీక్షా కేంద్రం చుట్టూ 360 డిగ్రీల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని, మెయిన్ గేట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు, చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఇన్విజిలేటర్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఈ రాత పరీక్ష పూర్తిగా రీజినల్ కోఆర్డినేటర్, మెదక్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.హుస్సేన్, నోడల్ ఆఫీసర్, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, (PBO) పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్ మధుసూదన్ గౌడ్, డీసీఆర్‌బీ సీఐ రవీందర్, బయోమెట్రిక్ సాంకేతిక నిపుణులు అనిల్‌కుమార్, మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని చెప్పారు. ఎలాంటి సందేహాలు ఉన్నా వారి దృష్టికి తీసుకొచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. హుస్సేన్, డీసీఆర్‌బీ సీఐ రవీందర్, ఎస్‌బీసీఐ సందీప్‌రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

మెదక్ మున్సిపాలిటీ/సిద్దిపేట అర్బన్, జూన్ 6: ఈనెల 9న జరుగనున్న గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఉన్నతాధికారులతో పరీక్ష నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్ నుంచి పరీక్షా కేంద్రాలకు, పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. స్ట్రాంగ్‌రూం నుంచి పోలీస్ బందోబస్తుతో తీసుకెళ్లి పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు.

నీలి విప్లవంపై నిర్లక్ష్యం!

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

- కేసీఆర్ హయాంలో మే నెలలోనే టెండర్లు పూర్తి
- కాంగ్రెస్ సర్కారులో ఊసే లేని టెండర్ల ప్రక్రియ
- మెదక్ జిల్లాలోని 1411 చెరువుల్లో 4 కోట్ల 63 లక్షల చేప పిల్లలను వదిలిన కేసీఆర్ సర్కారు
- మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ఆసరాగా నిలిసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఈ ఏడాది చేప పిల్లల పంపిణీపై స్పష్టత లేదంటున్న మత్స్యకారులు
- అసలు చేప పిల్లల పంపిణీ చేస్తారా అనే సందిగ్ధం
- ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక పంపిణీ చేస్తామన్న అధికారులు

మెదక్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు నీలి విప్లవంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో మొత్తం 1411 చెరువులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 280 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. మత్స్యకార వృత్తిపై సుమారు 17,500 మంది మత్స్యకారులు, వారి కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో కేసీఆర్ ప్రభుత్వం 1411 చెరువుల్లో రూ.4 కోట్ల విలువ గల 4 కోట్ల 63 లక్షల చేప పిల్లలను వదిలింది. బొచ్చ, రోహు, మ్రిగాల, బంగారు తీగ వంటి రకాల చేపపిల్లలు చెరువుల్లోకి వదిలి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపింది. వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఆసరాగా నిలిచింది. కానీ, ఈ ఏడాది కాంగ్రెస్ సర్కారు నుంచి ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీపై స్పష్టత రాలేదు. దీంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. అసలు చేప పిల్లల పంపిణీ చేస్తారా అనే సందిగ్ధం మత్స్యకారుల్లో ఉంది.

ఊసే లేని టెండర్ ప్రక్రియ

చేప పిల్లల కొనుగోలు కోసం ప్రతి ఏడాది మేలోనే ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ చేపడుతుంది. జూన్‌లో వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు చేరితే ఆగస్టులో మత్స్యకారులకు వందశాతం సబ్సిడీపై మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను పంపిణీ చేస్తారు. ఈ ఏడాది జూన్ వచ్చినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి రాలేదు. జిల్లావ్యాప్తంగా చేప పిల్లల కొనుగోలుకు టెండర్లు పిలవాల్సి ఉన్నా... ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు వందశాతం సబ్సిడీపై చేప పిల్లలతోపాటు సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో భాగంగా ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు, సంచార చేపల అమ్మకం వాహనాలు, చేపల కిట్లతో పాటు ఇతర సామగ్రిని మత్స్యకారులకు సకాలంలో అందజేశారు.

పంపిణీ ఆలస్యమైతే నష్టమే...

ప్రతి ఏడాది మెదక్ జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్‌లలో చేప పిల్లల పంపిణీ ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లోకి నీరు సమృద్ధిగా వస్తే ఆ సమయంలో చేప పిల్లలు వదిలితే ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. ఆలస్యం చేస్తే చేపపిల్లలు ఎదగడం కష్టంగా మారే అవకాశం ఉందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేప పిల్లల పంపిణీ ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులను ఆదుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు..

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపడుతాం. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. ఆ తర్వాత జిల్లా స్థాయిలో టెండర్ ప్రక్రియ ఉంటుంది. గతేడాది మెదక్ జిల్లా వ్యాప్తంగా 1411 చెరువుల్లో 4.63 కోట్ల చేప పిల్లలను వదిలాం. ఈ సంవత్సరం ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. – నర్సింహారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, మెదక్

సిద్దిపేట జిల్లా శ్రీగిరిపల్లిలో పత్తి విత్తనాలు పెడుతున్న మహిళా కూలీలు

సిద్దిపేట జిల్లా శ్రీగిరిపల్లిలో నాగలితో అచ్చకొడుతున్న రైతు

సాగు పనులు షురూ..

- పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు
- సిద్దిపేట జిల్లాలో పత్తికే మొగ్గుచూపుతున్న కర్షకులు
- అధికంగా పత్తి సాగయ్యే అవకాశం

గజ్వేల్, జూన్ 6: వానకాలం సాగు పనులు మొదలయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు దుక్కులు దున్నుతూ విత్తనాలు పెడుతున్నారు. ఈ ఏడాది సిద్దిపేట జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో పత్తి పెట్టేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తిని చూపుతున్నట్లు వ్యవసాధికారులు తెలిపారు. అందుకు తగిన విధంగా విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. చినుకులు కురుస్తుండడంతో రైతులు ఎక్కువగా విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. గజ్వేల్ మండలంలోని వివిధ గ్రామాల్లో నల్లరేగడి భూముల్లో రైతులు పత్తి విత్తనాలు పెట్టడం ప్రారంభించారు. గజ్వేల్ మండలంలో ఈ ఏడాది 18,200 ఎకరాల్లో పత్తి, 14వేల ఎకరాల్లోవరి, 15 వందల ఎకరాల్లో మొక్కజొన్న, 120 ఎకరాల్లో కంది సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. గతేడాది 15వేల ఎకరాల్లో పత్తి సాగవగా, ఈ ఏడాది మరో మూడు వేల ఎకరాల్లో వేసేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే రైతులు పత్తి విత్తనాలు విత్తడంలో నిమగ్నమయ్యారు. ముందుగా వర్షాలు రావడంతో మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో మహిళా కూలీలు పత్తి విత్తనాలు పెడుతూ కన్పించారు.

తూప్రాన్: మల్కాపూర్‌లో ఇండ్లలోకి చేరిన వర్షపు నీటిని ఎత్తిపోస్తున్న మహిళ

దంచికొట్టిన వాన

స్తంభించిన జనజీవనం

జిన్నారం, మే 6: మండల వ్యాప్తంగా గురువారం వాన దంచికొట్టడంతో జనజీవనం స్తంభించింది. పారిశ్రామికవాడలో రసాయన వ్యర్థాలు వాన నీటిలో కలిసి చెరువు, కుంటల్లోకి చేరాయి. వ్యవసాయ పనులకు చాలా మేలు చేసిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయింది. రాత్రి వరకు రాలేదు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

న్యాల్‌కల్‌లో భారీ వర్షం

న్యాల్‌కల్, జూన్ 6: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ వర్షం వానకాలం సాగుకు ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఆత్మూర్‌లోని మున్నురు పోచమ్మ ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది.

తూప్రాన్/మనోహరాబాద్, జూన్ 6:

తూప్రాన్, మనోహరాబాద్ ఉమ్మడి మండలాల్లో వర్షం దంచికొట్టింది. రెండు రోజులుగా చిరుజల్లులతో పలుకరించిన వర్షం గురువారం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. తూప్రాన్ మండలం మల్కాపూర్‌లోని మూడో వార్డులో అంతర్గత మురికికాల్వ కోసం నెల క్రితం పనులు మొదలుపెట్టి పూర్తి చేయకపోవడంతో ఇండ్లలో వర్షపు నీరు వచ్చి కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాకాలం మొదలవ్వకముందే పనులను పూర్తి చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇండ్లలోకి నీరు చేరి అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

గాలులకు విరిగిపడిన చెట్లు

హత్నూర, జూన్ 6: భారీగా వీచిన ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పంటసాగుకు సిద్ధమయ్యారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

హత్నూర: కొన్యాల-చీక్‌మద్దూర్ ప్రధాన రహదారిపై ఈదురుగాలులకు రోడ్డుపై విరిగి పడిన చెట్లు

బగలాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

గజ్వేల్ మున్సిఫ్ కోర్టు జడ్జి ప్రియాంక దంపతులను సన్మానిస్తున్న శక్తిపీఠం స్థలదాత పబ్బ రమేశ్‌గుప్తా

శివ్వంపేట, జూన్ 6: మండల కేంద్రంలోని బగలాముఖీశక్తిపీఠంలో గురువారం అమ్మవారికి విశేషమైన పంచగ్రహ కూటమి, హరిద్రార్చన, అభిషేకం, బగలా అష్టోత్తర నామార్చనలు, మంగళహారతి, మంత్ర పుష్పం, మంగళనీరాజనంతో పాటు ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమావాస్య పర్వదినం సందర్భంగా ధ్యానమందిరంలో బగలాముఖీ మహామంత్ర హవనం నిర్వహించారు. శని జయంతి, అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గజ్వేల్ మున్సిఫ్ కోర్టు జడ్జి ప్రియాంక దంపతులు, శక్తిపీఠం స్థల దాతలు పబ్బ రమేశ్ గుప్తా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులకు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పూజల్లో శక్తిపీఠం ట్రస్ట్ సభ్యుడు శాస్త్రుల పురుషోత్తం శర్మ, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, దాతలు నందకిశోర్, పెద్దగౌని సూర్యంకుమార్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు పిట్ల సత్యనారాయణ, వంజరి కొండల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, నవాబ్‌పేట మాజీ సర్పంచ్ ఏనుగు అశోక్‌రెడ్డి, పైనం యాదగిరి, బొడ్డు భిక్షపతి, బాసంపల్లి పోచగౌడ్, ముద్దగల రాజు, షేక్ అలీ, సంద్ర సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

సాగుబాటలో..

సంగారెడ్డి జిల్లాలో రెండు రోజుల నుంచి తొలకరి జల్లులు కురుస్తున్నాయి. దీంతో రైతులు వానకాలం వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ట్రాక్టర్లతో దున్నకాలు చేస్తున్నారు. కొందరు రైతులు విత్తనాలు వేస్తుండగా, మరికొందరు గంటుక పనులు చేపడుతున్నారు. ఎరువులు, విత్తనాల కొనుగోళ్లకు రైతులు రావడంతో ఫర్టిలైజర్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. – సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, జూన్ 6

సంగారెడ్డి పట్టణ శివారులో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

పుల్కల్‌లో సైకిల్ దంతెతో దున్నుతున్న రైతు



పుల్కల్: గంగులూరులో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

పుల్కల్‌లోని దుకాణంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతులు